మట్టి, మొరం.. అక్రమార్కులకు వరం

- నిబంధనలకు విరుద్ధంగా తవ్వకం
- యథేచ్ఛగా తరలింపు
- సర్కారు ఆదాయానికి గండి

వరద కాలువ నుంచి మొరం టిప్పర్‌లో నింపుతున్న ఎక్స్‌వేటర్ (ఫైల్)

మట్టి, మొరం, ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపి తరలిస్తుండడంతో సర్కారు ఆదాయానికి గండిపడుతున్నది. అక్కడక్కడా అధికారులు దాడులు చేస్తూ కట్టడి చేస్తున్నా ఈ దందా జోరుగా సాగుతున్నది. మండలంలోని పలు గ్రామాల్లో వెలుగుచూసిన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నవి.

-మల్యాల, ఏప్రిల్ 17

బల్వంతాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి గ్రామ శివారులోని తన పట్టా భూమిలో నల్లమట్టిని తీసి ఇటుక బట్టీల యజమానులకు అమ్ముకునేందుకు ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. అయితే పర్మిషన్ తీసుకున్న సర్వే నంబర్‌లో కాకుండా మరోచోట మట్టి తవ్వడం వివాదానికి దారి తీసింది. గ్రామానికి చెందిన పలువురు పోలీస్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. 4 టిప్పర్లకు మాత్రమే అనుమతి ఇవ్వగా, 12 టిప్పర్లలో తరలిస్తున్నట్లు గుర్తించి వాహనాలను మల్యాల ఠాణాకు తరలించారు. అనుమతులు తీసుకోకుండా మట్టి తరలిస్తున్న ఎనిమిది టిప్పర్ల యజమానులు, బాధ్యుడైన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఇదే తరహాలో గొర్రెగూడెం శివారులోని ఓ చెరువులో మట్టి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి..

వరద కాలువ కట్ట నుంచి మొరం..

మండలంలోని ముత్యంపేట, రామన్నపేట, సర్వాపూర్, రాంపూర్, నూకపల్లి శివారులోని వరద కాలువ కట్ట నుంచి రాత్రిపగలు మొరాన్ని తరలిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉన్న జగిత్యాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇరిగేషన్ అధికారులు ఇటీవల రాంపూర్ వద్ద అక్రమంగా మొరం తరలిస్తున్న వాహనాలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. రాజారాం శివారు నుంచి సైతం 24 గంటలు మొరాన్ని తరలిస్తున్నారు. అలాగే, భీమారం మండలం కమ్మర్‌పేట శివారు నుంచి ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్నారు. కొద్ది రోజుల క్రితం రాంపూర్ శివారులో అటవీశాఖ అధికారి, డ్రైవర్ ట్రాక్టర్లను ఆపి బెదిరించి పైసలు వసూలు చేయడంతో ఇసుక దందా వెలుగు చూసింది. ఈ క్రమంలో పోలీసులు నిఘా పెట్టి మరో రెండు వాహనాలను పట్టుకున్నారు. అయినప్పటికీ కొందరు ఇసుకను రాంపూర్ ఒడ్డెరకాలనీ, అంతర్గాం-కొండాపూర్ అప్రోచ్ రోడ్డు ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు. ఈ మార్గం మూడు పోలీస్‌స్టేషన్ల సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమార్కులు ఇసుక తీసుకెళ్లేందుకు ఈ రోడ్డును ఎంచుకున్నట్లు తెలిసింది.

అన్ని శాఖల సమన్వయంతోనే అడ్డుకట్ట..

మండల పరిధిలో నల్ల మట్టి, ఇసుక అక్రమ రవాణా, మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలంటే మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, అటవీ, రవాణా, పోలీస్‌శాఖ అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి. అక్రమంగా మట్టి, ఇసుక, మొరాన్ని తరలిస్తున్న వాహనాలపై దాడులు చేస్తేనే ఫలితం ఉంటుంది.

మా దృష్టికి వచ్చిన వాటిపై చర్యలు తీసుకుంటున్నం

మండల పరిధిలో అక్రమంగా మొరం, నల్లమట్టి తవ్వకాలతో పాటు ఇసుక అక్రమ రవాణాపై త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నం. రాబోయే రోజుల్లో సైతం ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి చెరువులు, కుంటలు, వాగులు, వరద కాలువ కట్టపై అక్రమ తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటం.

-మునీందర్, తహసీల్దార్, మల్యాల

నామినేషన్ల స్వీకరణ పారదర్శకంగా చేపట్టాలి

- పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల, ఏప్రిల్ 17: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఇతర ఉన్నతాధికారులతో కలిసి లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితాల రూపకల్పనపై ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఓటరు స్లిప్పులు ప్రతి ఓటరుకు అందేలా చూడాలని ఆదేశించారు. ఈనెల 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, 25వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నామినేషన్ స్వీకరణ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంత వరకు ప్రత్యేక ఎంట్రీ, ఎగ్జిట్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ జరుగాలని, రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ల స్వీకరణపై ప్రతి రోజూ నివేదికలను సమర్పించాలన్నారు. ప్రతి రోజూ దాఖలైన నామినేషన్ అభ్యర్థుల అఫిడవిట్‌లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా మానిటరింగ్ సెల్‌ను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అదనపు కలెక్టర్లతో కలిసి సందర్శించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దివాకర, రాంబాబు, ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

సొంత గూటికి చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

గంగాధర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల, ఏప్రిల్ 17: పట్టణానికి చెందిన 20వ వార్డు కౌన్సిలర్ గంధం గంగాధర్ తిరిగి సొంత గూటికి చేరారు. వారం క్రితం కాంగ్రెస్‌లో చేరిన ఆయన బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆధ్వర్యంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, ఆయనకు ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాను తిరిగి బీఆర్ఎస్‌లోకి రావడం సంతోషంగా ఉందని, తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు రుణపడి ఉంటానని గంగాధర్ తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల వెంట నడుస్తానని ఉద్ఘాటించారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, కౌన్సిలర్లు జిందం లక్ష్మీనారాయణ, పేర్ల సత్యం, సజ్జు, యాటం అరుణ్, మురళి, రఫీ, బాబా, తదితరులున్నారు.

మేకను కాపాడబోయి.. మృత్యుఒడిలోకి..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 17: కుటుంబానికి అండగా నిలుస్తున్న కొడుకు చెరువులో శవమై తేలిండు. నీళ్లల్లో పడ్డ మేకను కాపాడేందుకు వెళ్లి మృత్యుఒడికి చేరాడు. చెరువు గట్టున విగతజీవిగా మారిన కొడుకును చూసి తల్లిదండ్రులు రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కన్నీళ్లు పెట్టించింది. ఎల్లారెడ్డిపేటలో శ్రీరామనవమి రోజున ఈ విషాద ఘటన చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేటకు చెందిన మిర్యాల్‌కార్ కిషన్-లక్ష్మీబాయికి ముగ్గురు కొడుకులు సాయికృష్ణ(23), వినీత్, దేవీలాల్ ఉన్నారు. వీరు వృత్తిరీత్యా మాంసం విక్రయిస్తుంటారు. ఇందుకోసం మేకలను కొనుగోలు చేసి వాటిని మేతకు తీసుకెళ్తారు. తండ్రి దివ్యాంగుడు కావడంతో పెద్దకొడుకైన సాయికృష్ణ అన్ని పనులు చూసుకొనేది. ఈ క్రమంలో బుధవారం ఉదయం సాయికృష్ణ తండ్రి కిషన్‌తో కలిసి మేకలు మేపేందుకు గిద్దె చెరువు సమీపంలోకి వెళ్లారు. మందలోని ఓ మేక చెరువులోని నీళ్లల్లోకి వెళ్లడంతో రక్షించేందుకు సాయికృష్ణ చెరువులోకి దిగాడు. చెరువు గట్టుపై ఉన్నవారు వారిస్తున్న వినకుండా లోతులోకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడు. గట్టుపైనున్న కొత్త రాజు, కుంచెపు రవి, గౌరీశంకర్ చెరువులో దిగి వెతుకగా మృతదేహం దొరికింది. పండుగ పూట కొడుకు మరణంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల దవాఖానకు తరలించారు.

మద్యం పట్టివేత

కోరుట్ల, ఏప్రిల్ 17: పట్టణ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఓ కిరాణా షాపులో అక్రమంగా విక్రయిస్తున్న రూ. 6500 విలువైన మద్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. షాపు నిర్వాహకుడు గోపిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి రైలులో సాధారణ బోగీలను ఐదుకు పెంచాలి

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 17: ప్రతి రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు చేపట్టిన దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ బుధవారం వెల్ది గ్రామంలో ప్రధాన మంత్రికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల సౌకర్యం కోసం ప్రతి రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ప్రధానమంత్రికి దేశ వ్యాప్తంగా కోటి ఉత్తరాలు రాసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా టు, ది ప్రైమ్ మినిస్టర్, ప్రైమినిస్టర్ ఆఫీస్, 152సౌత్ బ్లాక్, రైసినా హిల్స్, న్యూఢిల్లీ-110011 చిరునామాకు ఉత్తరం రాసి పంపాలని కోరారు. వివరాలకు 9989310141లో సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు, సీనియర్ సిటిజన్స్ దాదాపు 200 మంది ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. సాధన సమితి కరీంనగర్ జిల్లా కన్వీనర్ వెనగంటి చంద్రమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుంక సందీప్, బొమ్మిడి రమేశ్, పూలు శ్రీధర్, గాడిపల్లి శ్రీనివాస్, అన్నలదాసు రఘుపతి, సుంక మల్లయ్య, కొండా చంద్రమౌళి, సంతోష్, మహేందర్, సుంక చందు, మెరుగు శ్రీనివాస్, వడ్డే సీతారామయ్య, కొదుమూరి పుల్లయ్య, వీరభద్రయ్య, ప్రమీల పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గ్రామస్తురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ధర్మపురి, ఏప్రిల్ 17: శాలపల్లిలోని రామాలయం ప్రాంగణంలో బుధవారం మంచిర్యాలకు చెందిన డా.అనంత రెడ్డి క్రిటికల్ కేర్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు లోక్‌సాయినాథ్ రెడ్డి, సురేశ్‌నాయక్, శ్రీమల్లి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు

మెట్‌పల్లి, ఏప్రిల్ 17: పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాలుగో రోజు స్థానిక ప్రభుత్వ దవాఖాన, తిరుమల దవాఖానలో అగ్ని ప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత దవాఖానల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం అధికారి మల్లికార్జున్‌యాదవ్, సిబ్బంది ఆంజనేయులు, వహిదుల్లాఖాన్, భాస్కర్, సంతోష్, రాజేశ్, సంతోష్‌కుమార్, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

వెల్గటూర్, ఏప్రిల్ 17: కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన బండారి సత్తవ్వ (38) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నది. దవాఖానల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంటి వెనుకాల ఉన్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కాగా, సత్తవ్వ భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 17: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని సంగెం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనిగరపు మహేశ్(30) గల్ఫ్ వెళ్లేందుకు బంధువుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మహేశ్ తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

భూషణరావుపేటలో ధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న డీఎస్‌వో వెంకటేశ్వర్లు

కథలాపూర్, ఏప్రిల్ 17: మండలంలోని గంభీర్‌పూర్, తాండ్యాల, చింతకుంట, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం కుప్పలు, తూకం వేసిన వాటి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తూకంలో జాప్యం చేయవద్దని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట సీఈవోలు అరుణ్, విజయ్, రైతులు ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న న్యాయమూర్తులు


ఆలయంలో కూర్చున్న న్యాయమూర్తులు

మల్యాల, ఏప్రిల్ 17: కొండగట్టు అంజన్న ఆలయంలో వేములవాడ, సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల కోర్టుల న్యాయమూర్తులు జ్యోతి, ప్రవీణ్‌కుమార్, హేమలత, స్వాతి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నలుగురి అరెస్టు

కథలాపూర్, ఏప్రిల్ 17: మండలంలోని తక్కళ్లపెల్లిలో నక్క సతీశ్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నలుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన ఒడిబిడి పోశెట్టి, అతడి భార్య లక్ష్మి, బింగి గంగామణి, ఆటో డ్రైవర్ జావేద్‌ఖాన్ ఈనెల 15న తక్కళ్లపెల్లిలో సతీశ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. సతీశ్ ఫిర్యాదు మేరకు నిఘా పెట్టగా.. బుధవారం అనుమానాస్పద స్థితిలో నలుగురు వ్యక్తులు పోలీసులకు కనిపించారు. వారిని అదుపులోకి విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ. 3 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ వివరించారు.


జగిత్యాల రూరల్: చల్‌గల్ రామాలయంలో పూజలు చేస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

మారుతీనగర్: స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు

కోరుట్ల: సీతారామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

కల్యాణం.. కమనీయం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- సీతారాముల కల్యాణాన్ని తిలకించి పులకించిన భక్తులు

మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, వేదపండితులు

జగిత్యాల రూరల్/ మల్లాపూర్/ మారుతీనగర్/ధర్మపురి/ సారంగాపూర్/ రాయికల్/ కోరుట్ల/ కోరుట్ల రూరల్/ కథలాపూర్/ పెగడపల్లి/ వెల్గటూర్, గొల్లపల్లి/ ఇబ్రహీంపట్నం/ కొడిమ్యాల/ మల్యాల/ ధర్మపురి, ఏప్రిల్ 17: జిల్లా వ్యాప్తంగా ప్రజలు బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. జగిత్యాల పట్టణంలోని హనుమాన్ వాడ, విద్యానగర్ రామాలయం, మార్కండేయ ఆలయం, అంతర్గాం, చల్‌గల్, హన్మాజీపేట రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మల్లాపూర్ మండలం వాల్గొండలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, సిరిపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయం, మల్లాపూర్, కుస్తాపూర్‌లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం జరిపించగా, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హాజరై పూజలు చేశారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని శేషప్ప కళావేదికపై సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే, అనుబంధ ఆలయం తిమ్మాపూర్ సీతారామాలయంలో, గోదావరి ఒడ్డున గల రామాలయంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవానికి ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్ ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. మెట్‌పల్లి పట్టణంలోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు పట్టు వస్త్రాలతో పాటు తలంబ్రాలను సమర్పించారు. సారంగాపూర్, మండలంలోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని వెంకటాపూర్, మాదాపూర్, జోగన్‌పల్లి, ధర్మారం గ్రామాల్లో గల ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాజరై పూజలు నిర్వహించారు. కథలాపూర్ మండలం చింతకుంట, భూషణ్‌రావుపేట, దూలూర్, పోసానిపేట, అంబారిపేటలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం, కొడిమ్యాల మండలాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేడిపల్లి మండలంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు పాల్గొన్నారు. మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. రాజారాం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్నాకుల కోదండ రామాలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ధర్మపురి పట్టణంలోని లక్ష్మీనరసింహకాలనీలో గల రామాలయం, తిమ్మాపూర్, దొంతాపూర్‌లోని రామాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణమహోత్సవానికి విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై పూజలు చేశారు. పెగడపల్లిలోని రాజరాజేశ్వరస్వామి, బతికపల్లి భక్తమార్కండేయస్వామి, రాంభద్రునిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, ఎంపీపీ శోభాసురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రాజేందర్‌రావు హాజరయ్యారు.

మల్యాల: ఎర్నాకుల రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ధర్మపురి: దొంతాపూర్ ఆలయంలో పూజలు చేస్తున్న విప్ అడ్లూరి

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

రామడుగు(చొప్పదండి)/కొత్తపల్లి, ఏప్రిల్ 17: రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ మొదటి ప్రయత్నంలోనే యూపీఎస్సీ ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించగా, బుధవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ వారి ఇంటికి వెళ్లి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా కష్టపడితే అందని విజయం అంటూ ఉండదని, విద్యార్థులందరూ సాయికిరణ్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అలాగే నందాల సాయికిరణ్‌కు పద్మశాలీ కులస్తులు బుధవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. వెలిచాలలోని ఆయన నివాసానికి వెళ్లిన కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, పద్మశాలీలు సాయికిరణ్‌తో పాటు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించారు. జిల్లాకు చెందిన సాయికిరణ్ సివిల్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించడం గర్వంగా ఉందన్నారు.

వెలిచాలలో సాయికిరణ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194